క్లుప్తంగా

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి రామమందిరం వద్ద గురువారం అనాథ వృద్ధురాలు మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు వరం ఛారిటబుల్ ట్రస్టు సమకూర్చిన అంబులెన్సు, వలంటీర్ల పంపించారు. వారు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు పూర్తి చేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు జి.పవన్‌కుమార్, వలంటీర్లు జి.సూర్యప్రకాష్, జి.సునీల్‌దేవ్, ఆర్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.7 లక్షలతో రహదారి మరమ్మతులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారి నుంచి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం వరకు ఉన్న రోడ్డు మరమ్మతు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ నుంచి రూ.7 లక్షల నిధులు మంజూరయ్యాయి. తారు రోడ్డు మర్మతులు, గోతులు పూడ్చటం, రోడ్డు పక్కన జంగిల్ క్లియరెన్స్, బెర్మ్‌ల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఏఈ హేమలత ఈ పనులను పర్యవేక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న గ్రామస్తులు, భక్తులు

లావేరు: లింగాలవలసలో గల షిర్డీ సాయిబాబా ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకున్నారు.

25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్‌హరితాశ్రీ

జి.సిగడాం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి పొన్నాడ హరితాశ్రీ అన్నారు. స్థానిక ఆస్పత్రిలో 25 మంది గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి కావల్సిన మందులను పంపిణీ చేశారు. జి.సిగడాం గ్రామానికి చెందిన దుబాకుల శిరీష సహకారంతో గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి యశ్వంత్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు ఉన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

జి.సిగడాం: పశువులు, మూగజీవులకు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మండల పశువైద్యాధికారి యు.సుమన్ అన్నారు. గురువారం పెంట సచివాలయంలో పశువులు, గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు.

వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని కత్తెర వీధిలో నివాసముంటున్న వ్యక్తి గురువారం మృతిచెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వూన్న వెంకటరమణకు పెదబరాటం వీధికి చెందిన యువతితో వివాహమైంది. భార్య గర్భిణిగా ఉన్న సమయం నుంచే కుటుంబ కలహాలు తోడవ్వడంతో మద్యానికి బానిసయ్యాడు. 2015లో ఇందిరాకాలనీలో నివాసముంటున్న వెంకటరమణ సోదరి అతనికి ఆటో కొనిచ్చింది. అప్పటినుంచి వెంకటరమణ కుటుంబానికి, బంధువులకు, సోదరికి సంబంధం లేకుండా ఆటో నడపగా వచ్చే సొమ్ముతో హోటళ్లలో తింటూ.. మద్యం పూటుగా తాగుతుండేవాడు. ఆటోనే స్థిరనివాసంగా ఏర్పర్చుకొని అక్కడే నిద్రించేవాడు. మూడు రోజులుగా మద్యం ఎక్కువగా సేవించడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: నడిమివలసలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పెదలింగాలవలసలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాళ్లే దాలినాయుడు, పార్టీ నాయకులు లుకలాపు శ్రీధర్, లుకలాపు అనిల్‌కుమార్, లుకలాపు చినశ్రీను, లంక సూర్యారావు, శంబాన సూర్యారావు పాల్గొన్నారు.

జి.సిగడాం: విశాఖపట్నం రాజధాని కావాలంటే పట్టభద్రులంతా సీతంరాజు సుధకర్‌కు మద్దతుగా నిలవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. నడిమివలస, విజయరాంపురం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని, అందరూ మద్దతుగా నిలవాలన్నారు. సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ (వైఎస్సార్ సీపీ) అభ్యర్థి నర్తు రామారావుకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు బాలి రమేష్‌నాయుడు, వడిశ మహేశ్వరావు, బాలి అప్పలసూరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఎస్.ఎం.పురం, లింగాలపేట, అల్లినగరం, అరిణాంఅక్కివలస తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సనపల నారాయణరావు, మాడుగుల మురళీధర్‌బాబా, టి.రమణబాబు, అంబటి శ్రీనివాసరావు, కింతలి ఈశ్వరరావు, కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.



లావేరు: పెదలింగాలవలసలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జి.సిగడాం: మాట్లాడుతున్న హరిత.శ్రీ

జి.సిగడాం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి పొన్నాడ హరితశ్రీ అన్నారు. గురువారం స్థానిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధిక టీకాలు వేయాలన్నారు.

ప్రజలు పరిశుభ్రమైన నీరు తాగాలన్నారు. అంటు రోగాలు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో అంకిత భావంతో పని చేయాలన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు



పూజలందుకుంటున్న సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలిపురం దర్బార్ షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామి వారికి మూడు హారతులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు కడప, విశాఖ



గోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న కడప స్ట్రయికర్స్

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో విశాఖ, కడప జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. విశాఖపట్నంలోని రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో సెమీస్ చేరేందుకు వైఎస్సార్ కడప జట్టు 6–0 గోల్స్ తేడాతో కర్నూల్ జట్టుపై విజయం సాధించింది. జట్టు తరఫున అనురాధ మూడు గోల్స్ చేయగా అరుణ రెండు, రామలక్ష్మి ఓ గోల్ చేశారు. సెమీస్ చేరేందుకు చెరో మ్యాచ్ గెలిచిన విశాఖ–చిత్తూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి విశాఖ జట్టు 4–3తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. హేమహాసిని మూడు, వరలక్ష్మి ఓ గోల్ చేయగా చిత్తూరు తరఫున షహీనా మూడు గోల్స్ చేసింది. కల్యాణి, శృతి, ధరణి ఒక్కో గోల్ చేయడంతో కృష్ణా జట్టు 3–0తో శ్రీకాకుళంపై విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు 2–0తో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. అశ్విని, గాయత్రి చెరో గోల్ చేశారు. ఏపీ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల జట్లు తలపడుతున్నాయి.

నీలమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



పూజలందుకుంటున్న నీలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పెద్దబరాటంవీధి గైనేటి వీధిలో కొలువుదీరిన నీలమ్మతల్లి అమ్మవారికి గురువారం పాలతో అభిషేకాలు చేశారు. అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ముగ్రాట్లు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు బరాటం సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ పార్వతి

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నా కొన్నిచోట్ల వేధింపులు ఆగడం లేదని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గైనిక్ విభాగాధికారి డి.పార్వతి, జిల్లా ఆడిట్ అధికారి సీహెచ్.ప్రభావతిలు పేర్కొన్నారు. మహిళలపై దాడులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏపీ ఎన్జీఓ సంఘ మహిళా విభాగం చైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బి.మోహనరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రాయి వేణుగోపాల్, ఎన్జీఓ సంఘ మహిళా నేతలు పి.శ్రావణి, కె.రోజాకుమారి, మమతాకుమారి బెహరా, సబినాబేగం, జి.లలిత, కె.ఉదయరేఖ, కె.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దుంపల హరిప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: కిడ్నీ వ్యాధిపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ దుంపల హరిప్రసాదరావు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరీరంలో ఉన్న వ్యర్థ పదార్థాలు, మలినాలను ప్రతి సెకెనూ కిడ్నీ బయటకు విసర్జిస్తుందన్నారు. ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వాడితే కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. సీరం క్రియాటిన్ పరీక్షతో కిడ్నీ వ్యాధిని గుర్తించవచ్చన్నారు. ఆహార నియమాలు పాటించడం ద్వారా వ్యాధిబారిన పడకుండా ఉండవచ్చన్నారు. డాక్టర్ కొర్ల విద్యాసాగర్ మాట్లాడుతూ భారత్‌లో ఏటా కొత్తగా రెండున్నర లక్షల మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. రక్తపోటు, షుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలని, పెయిన్ కిల్లర్స్ వాడకం తగ్గించాలన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి లభించిందన్నారు. నెఫ్రాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ రాయపురెడ్డి రంగనాధరావు మాట్లాడుతూ హైబీపీ, డయాబెటిస్ వ్యాధితో బాధపడే వారిలో 40 శాతం మంది దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కిడ్నీ వ్యాధిని మొదటిదశలోనే గుర్తిస్తే డయాలసిస్‌తో నయం చేయవచ్చన్నారు. కిడ్నీ వ్యాధి గుర్తించిన ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట

లావేరు: మండలంలోని నాగంపాలెంలో ఆభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట గురువారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమడాం పంచాయతీ ఉప సర్పంచ్ డి.ధర్మారావు, గుమడాం మాజీ ఎంపీటీసీ వాళ్లే కాశినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జగ్గరోతు తవిటినాయుడు, లుకలాపు అప్పలనాయుడు, ముప్పిడి శ్రీరాములు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల్లో రూ.2.40 లక్షలు స్వాహా!

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామ సంఘంలో స్వయం శక్తి సంఘాల మహిళలకు చెందిన స్త్రీ నిధి రుణాల్లో రూ.2.40 లక్షలు స్వాహా అయ్యింది. గ్రామానికి చెందిన ఏపీజీవీబీ కస్టమర్ సర్వీస్ పాయింట్ నడుపుతున్న టి.జయశ్రీ ఎస్‌హెచ్‌జీలు చెల్లించిన మొత్తాలను బ్యాంక్‌లో చెల్లించకుండా ఆ నగదును వేరే అవసరాలకు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామైక్య సంఘాల అంతర్గత ఆడిట్‌లో ఆరు మాసాల కిందటే ఈ బాగోతం బయటపడగా బ్యాంక్ అధికారులు, వీఓఏ, సీఎస్‌పీ గుట్టుగా దాచినట్లు తెలిసింది. రెండు రోజులు కిందట పూండి ఏపీజీవీబీ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టినా ఆ సొమ్ములు ఏమయ్యాయో తేల్చలేదు. బ్యాంక్ లింకేజీలకు చెందిన రుణాలు చెల్లింపుల్లో కూడా అవకతవకలు బయటపడినట్లు తెలుస్తోంది. స్వాహా అయిన నిధులు లెక్క తేలకపోవడంతో సీఎస్‌పీని స్వయం శక్తి సంఘాల మహిళలు, సర్పంచ్ దున్న రత్నంబాలరాజు నిలదీశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ విదాకచసాగర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెలుగు ఏపీఎం జాంబవతిని వివరణ కోరగా నిధులు స్వాహా కావడం వాస్తవమేనన్నారు. దీనికి కారకురాలిగా భావిస్తున్న జయశ్రీని సీఎస్పీ బాధ్యతలను నుంచి తప్పించారని తెలిపారు. ఆమెపై విచారణ కొనసాగుతోందని, రెండు రోజుల్లో సమాధానం రాకుంటే చర్యలు చేపడతామని చెప్పారు. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జయశ్రీ మళ్లీ బ్యాంక్‌లోనే వేరే సీఎస్‌పీ నుంచి యంత్రాన్ని తెచ్చి లావాదేవీలు నడుపుతున్నా ఏపీజీవీ బ్యాంక్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎఫ్‌సీఏ కార్యాలయం ప్రారంభం



ఎఫ్‌సీఏ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాంబాబు

రణస్థలం: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఫెసిలిటీ క్రియేటర్స్ అసోసియేషన్ (ఎఫ్‌సీఏ) నిరంతరం కృషి చేస్తోందని ఆ గ్రూప్ సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రాంబాబు అన్నారు. మండలం కేంద్రంలో ఎఫ్‌సీఏ 21వ కార్యాలయాన్ని సంఘం సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌సీఏలో సభ్యులుగా చేరిన కుటుంబాలకు చేయనున్న ఆర్థిక సహాయాన్ని వివరించారు. సభ్యులకు ఎటువంటి ఇబ్బంది ఎదురైనా కుటుంబానికి ఎఫ్‌సీఏ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎఫ్‌సీఏ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మైలపల్లి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి కె.చుక్కయ్య, జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్, ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, జాతీయ న్యాయ సలహాదారు రాయిపాటి శ్యామ్యుల్ జాన్, రాష్ట్ర న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర న్యాయ సలహాదారు జి.లతీష్ కుమార్, జీఎం ఎస్.కవిత, డీజీఎం సుఖేష్ పాల్గొన్నారు.

రాష్ట్రపోటీలకు పయనం



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సాంబమూర్తి, సుందరరావు, తైక్వాండో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖపట్నం జిల్లా యలమంచిలిలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు 40వ ఏపీ రాష్ట్ర సబ్ జూనియర్, 5వ ఏపీ క్యాడెట్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా క్రీడాకారుల బృందం గురువారం బయల్దేరి వెళ్లింది. పోటీల్లో పతకాల పంట పండించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు ఆధ్వర్యంలో వీరికి ఆల్ ద బెస్ట్ చెబుతూ వీడ్కోలు పలికారు. కొమర భాస్కర్ మాట్లాడుతూ గత నెల 19వ తేదీన జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర పోటీల్లో రాణించిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, వావిలపల్లి జగన్నాధరావు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాదరావు, ఎస్. జోగినాయుడు, ఉషూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్, కురిటి తారకరామా, రెడ్డి సాయిరాం, కొమర మోహన్ కృష్ణ, సకుముల్ల శివాజీ, ముద్దాడ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

- సబ్ జూనియర్ బాలుర విభాగంలో పి.గగన్, బి.శౌర్య, కె.సాక్షిత్, వి.రిషికేష్, ఆర్.నరేంద్రనాయుడు, డి.లీలామాధవ్, సిహెచ్ గౌతమ్ సిద్ధార్థ, జి.రోహిత్, సిహెచ్ యశ్వంత్, ఎస్.సేతునందన్, పి.పవన్, ఆర్.చతురసాయి ప్రీతం.
- సబ్ జూనియర్ బాలికల విభాగంలో డి.త్రివేణి, ఎం.సంజునా, సిహెచ్ మేఘ వర్షిత, ఎస్.భవిజ్ఞ, ఎం.జోషిక, పి.యషిత, బి.దేవిప్రియ, వి.చాతుర్య, సిహెచ్ తరణి, కే.నందిని, ఎస్.శ్రీశాన్వి.
- క్యాడెట్ బాలురు విభాగంలో ఎ.ప్రశాంత్ కుమార్, టి.దిల్లేశ్వరరావు, ఎ.ప్రేమ్ కుమార్, బి.హిమచందన్, ఎ.పూర్ణచంద్రరావు, ఎ.దేవి ప్రసాద్, జి.రిత్విక్ లోకేష్.
- క్యాడెట్ బాలికల విభాగంలో ఆర్.తన్మయి, ఆర్.హర్షిత చౌదరి ఎంపికైన వారిలో ఉన్నారు. కాగా జిల్లా బాలుర టీంకు కురిటి తారకరామ, జి.లక్ష్మణరావు, బాలికల టీంకు ముద్దాడ శిరీష, ధనలక్ష్మి కోచ్, మేనేజర్లుగా వ్యవహరించనున్నారు.

మహిళా కళాశాలలో జాబ్‌మేళా



ఎంపికైన వారితో కళాశాల, కంపెనీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మేండలీజ్ ఇండియా ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 50 మంది అభ్యర్థులు హాజరుకాగా 12 మంది అపాయింట్‌మెంట్ లెటర్లను అందుకున్నారు. వీరంతా త్వరలోనే ఉద్యోగాల్లో చేరనున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతాడ కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, మెంటార్ సీహెచ్ కాత్యాయిని, కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను కలిసిన వడ్డాది ఫణికుమార్



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఫణికుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు నెలకొల్పి 4 లక్షలు ఉద్యోగాలు కల్పించారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి వడ్డాది ఫణికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిరణ్ మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన మధ్యాహ్న భోజన పథకాలను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, కళాశాలలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమాలన్నీ విద్యార్థి విభాగం సభ్యులు, సోషల్ మీడియా కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పక్కా ఆధారాలతో తిప్పికొట్టాలన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ ప్రీ పబ్లిక్ ప్రారంభం



కొయ్యాంలో ప్రీ ఫైనల్స్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో గురువారం టెన్త్ ప్రీఫైనల్స్ పరీక్షలు ఆరంభమయ్యాయి. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 వరకు ఈ పరీక్షలు జరిగాయి. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు/సంస్కృతం) పేపర్‌కు పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఒకటీ అర తప్పితే.. శతశాతం మేరకు విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖ కార్యాలయ వర్గాలు చెబుతున్నారు. ఇప్పటికే మండల కేంద్రాలకు ప్రశ్న పత్రాలను జిల్లా విద్యాశాఖ పరీక్షల బోర్డు అధికారులు షీల్డ్ కవర్‌లలో చేరవేసిన విషయం తెలిసిందే. వాటిని ఆయా పాఠశాలలు తీసుకెళ్లి పరీక్షలను నిర్వహిస్తున్నారు. డీఈఓ గార పగడాలమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఉప విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు. ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 149 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ పంపించిన ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 149 కేంద్రాలను కేటాయిస్తున్నట్టు స్పష్టంచేసింది.

పశు వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న పశువైద్యురాలు గాయత్రి

లావేరు: పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని లావేరు పశువైద్య కేంద్రం వైద్యురాలు బి.గాయత్రి అన్నారు. పెదలింగాలవలసలో గురువారం పాడి రైతులుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడి పశువుల పెంపకంపై కూడా దృష్టి సారించాలన్నారు.

ఈ నెలాఖరు వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. సర్పంచ్ లుకలాపు యశోద, వైఎస్సార్ సీపీ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.